సాక్షి
రంగారెడ్డి

మంగళవారం ; 4 ; జూలై ; 2023



రూ.100 కోట్లతో అభివృద్ధి

తమ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 8లో▸



అభివృద్ధికి పెద్దపీట

పంచాయతీల అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. 8లో▸



దైవదర్శనానికి వెళితే..

దైవదర్శనానికి వెళ్లగా ఇంట్లో చొరబడిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన కొత్తూరులో చోటు చేసుకుంది. 8లో▸

న్యూస్‌రీల్

పోలింగ్ నిబంధనలపై అవగాహన

రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో మాక్‌పోల్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు సోమవారం రాజేంద్రనగర్‌లోని ఈవీఎం గోడౌన్‌లో మాక్‌పోల్ నిర్వహించారు. కార్యక్రమానికి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ హరీశ్ వారి సమక్షంలో మాక్‌పోల్ నిర్వహించి, పలువురి సందేహాలను నివృత్తి చేశారు. పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మాక్‌పోల్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పూర్తి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. పోలింగ్ సందర్భంగా పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ఇంటింటికీ వివరిస్తాం

తమిళనాడు రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి



చౌదరిగూడలో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

కొందుర్గు: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వివరిస్తామని తమిళనాడు రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు భువనేశ్వరి అన్నారు. సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లేడ్ చౌదరిగూడ మండలం వీరన్నపేట, రావిర్యాల గ్రామాల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భువనేశ్వరి మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. వాటిని అర్హులకు అందేలా చూసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఇందుకోసం కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు భూపాలచారి, మండలాధ్యక్షుడు కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 254 దరఖాస్తులు



అర్జీలు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు

ఇబ్రహీంపట్నం రూరల్: సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందని అడిషనల్ కలెక్టర్ తిరుపతిరావు పేర్కొన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. వివిధ సమస్యలపై 254 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు అడిషనల్ కలెక్టర్ సూచించారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

విద్యార్థులకు వర్క్‌బుక్స్ త్వరగా అందించండి



డీఈఓ సుశీందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులకు వర్క్ అడ్జెస్ట్‌మెంట్ చేయాలని పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం డీఈఓ కార్యాలయంలో జిల్లా విద్యాధికారి సుశీందర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. ఒకటి నుంచి ఐదు తరగతుల వర్క్‌బుక్స్ త్వరగా అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య, భిక్షం గౌడ్, వెంకట్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రాజిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శివకుమార్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గళమెత్తేనా..?

నేడు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

- జిల్లాలో తిష్ట వేసిన సమస్యలు
- ఈసారైనా ప్రస్తావనకు వచ్చేనా..
- పరిష్కార మార్గం దొరికేనా..
- జనం ఎదురుచూపులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పేదల ఆశలు 'డబుల్' అవుతున్నాయి. ఇళ్ల స్థలాల కోసం పోరాటాలు కొనసాగుతూనే ఉన్నాయి. మన ఊరు మనబడి పథకం కింద చేపట్టిన పనులు ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్నట్లుగా కొనసాగుతున్నాయి. జిల్లాలో అనేక సమస్యలు ఏళ్లుగా అపరిష్కృతంగా మిగిలిపోయాయి. ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులతో రివ్యూలు నిర్వహించి.. పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయించాల్సిన ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను, చేపట్టిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయని ప్రభుతాన్ని నిలదీసే అవకాశం ఉన్నా.. మెజార్టీ సభ్యులు కిమ్మనడం లేదు. సమావేశాలకు మెజార్టీ సభ్యులు గైర్హాజరవుతుండగా.. హాజరైన వారు కూడా కనీసం నోరు మెదపడం లేదు. ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో చర్చ జరగకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయి. మంగళవారం జెడ్పీ వేదికగా నిర్వహించే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలోనైనా ఆయా సమస్యలను ప్రస్తావించి, సత్వర పరిష్కారం కోసం కృషి చేస్తారో? మౌనంగా వెను తిరుగుతారో? వేచి చూడాలి.

పేదల ఆశలు 'డబుల్'

అర్హులైన నిరుపేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు 2016–17 వార్షిక సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా 6,777 ఇళ్ల నిర్మాణానికి పాలనా పరమైన అనుమతులు ఇచ్చింది. ఇందుకు 274.35 ఎకరాలు కేటాయించింది. వీటిలో 6,637 ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పిలవగా, వీటిలో 5,380 నిర్మాణం చేపట్టారు. ఎనిమిది నియోజకవర్గాల్లో సుమారు లక్ష మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం 14 ప్రాంతాల్లో 2,293 ఇళ్లు మాత్రమే చివరి దశలో ఉన్నాయి. డ్రైనేజీ, విద్యుత్, తాగునీటి నల్లాలు, డోర్ల వంటి పనులకు రూ.20 కోట్ల వరకు అవసరమని జిల్లా అధికారులు ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపగా, రూ.10 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన డబ్బులు మంజూరైతే కానీ.. నిర్మాణాలు పూర్తి కాని పరిస్థితి.

ఇళ్ల స్థలాల కోసం ఆందోళనలు

ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా గత ప్రభుత్వాలు ఇచ్చిన ప్రొసీడింగ్స్‌కు పొజిషన్ చూపకపోవడంతో లబ్ధిదారులంతా ప్రస్తుతం ఆయా భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. గుడిసెలు వేసుకున్న పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేయాలని కొంతకాలంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పేదలు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. 58, 59 జీఓల కింద జిల్లా వ్యాప్తంగా మరో యాభై వేల మందికిపైగా దరఖాస్తు చేసుకున్నారు. మొదటి విడతలో చేపట్టిన విచారణలో మెజార్టీ దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. రెండో దశలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ఇప్పటికీ పూర్తి కాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే పోడు భూముల పట్టాల పంపిణీ ప్రారంభమైంది. జిల్లాలో ఈ అంశంపై ఇప్పటికీ క్లారిటీ లేదు. పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులంతా ఆందోళన చెందుతున్నారు.

కేసీఆర్ కిట్టు.. నగదు కట్

మాతాశిశు మరణాల రేటును తగ్గించడంతో పాటు వారి ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం 2017 మార్చి 9న కేసీఆర్ కిట్టును ప్రవేశపెట్టింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డకు జన్మనిచ్చిన తల్లికి ఈ పథకంలో భాగంగా 15 రకాల వస్తువులతో పాటు పాప పుడితే రూ.13,000, బాబు పుడితే రూ.12,000 నగదు ప్రోత్సాహకంగా అందజేస్తోంది. 2022 మార్చి చివరి నాటికి ఈ పథకం కింద జిల్లాలో 95,658 మంది గర్భిణులు పేర్లు నమోదు చేసుకుని ఉన్నారు. వీరిలో 32,500 మందికి రూ.39 కోట్లకుపైగా చెల్లించాల్సి ఉంది. ప్రభుత్వం అందించే ఈ నగదు కోసం రెండేళ్లుగా ఎదురు చూపులు తప్పడం లేదు. గత ఏడాది ఆగస్టు 25న ఇబ్రహీంపట్నం ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన డీపీఎల్ క్యాంపులో కుటుంబ నియంత్రణ చికిత్సలు వికటించి నలుగురు మహిళలు మృతి చెందిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి జిల్లాలో డీపీఎల్ క్యాంపులను నిలిపివేశారు. దీంతో కుటుంబ నియంత్రణ చికిత్సలు చేయించుకోవాలంటే ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది.

అసంపూర్తిగా మన 'ఊరు–మనబడి'

జిల్లా వ్యాప్తంగా 1,351 ప్రభుత్వపాఠశాలలు ఉన్నాయి. వీటిలో సుమారు 1,43,678 మంది విద్యార్థులు వివిధ తరగతులు చదువుతున్నారు. 'మన ఊరు మనబడి' పథకంలో భాగంగా జిల్లాలో 464 స్కూళ్లను తొలి దశలో ఎంపిక చేసింది. ఇందుకు రూ.97.91 కోట్ల బడ్జెట్ కేటాయించింది. ఇప్పటి వరకు 54 స్కూళ్లలో మాత్రమే పనులు పూర్తయ్యాయి. మరో 180 స్కూళ్లలో పనులు చివరి దశలో ఉన్నాయి. మెజార్టీ స్కూళ్లలో ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో విద్యార్థులు శిథిల భవనాల కిందే చదువుకోవాల్సి వస్తోంది. విద్యార్థుల నిష్పత్తి మేరకు తరగతి గదులు లేకపోవడంతో ఒక్కో గదిలో రెండు వేర్వేరు తరగతుల పిల్లలను కూర్చొబెట్టి పాఠ్యాంశాలు బోధించాల్సి వస్తోంది. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట ఉపాధ్యాయులు లేకపోవడంతో పాఠ్యాంశాల బోధన ఇబ్బందిగా మారింది.

యాసంగి ధాన్యం డబ్బులు పడలే..

యాసంగిలో ధాన్యం కొనుగోలు కోసం జిల్లా వ్యాప్తంగా 37 కేంద్రాలు ఏర్పాటు చేసి, 60 వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. 6,444 మంది రైతుల నుంచి రూ.69.13 కోట్ల విలువైన 33,562 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు 1,577 మంది రైతులకు సంబంధించిన 22,511 టన్నుల ధాన్యానికి రూ.15.8 కోట్లు మాత్రమే నగదు చెల్లించారు. మరో 4,867 మంది రైతులకు రూ.53.32 కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. రైతుబంధు కింద ప్రభుత్వం అకౌంట్లలో జమ చేసిన డబ్బులను ఆయా బ్యాంకులు అప్పు కింద జమ చేసుకుంటుండటంతో రైతులు పంట సాగు కోసం మళ్లీ అప్పు చేయాల్సి వస్తోంది.



చేవెళ్ల: దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, యెగ్గె మల్లేశం తదితరులు

దొడ్డి కొమురయ్య పోరాటం ఆదర్శం

- హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ
- చేవెళ్ల, కందుకూరులో విగ్రహాల ఆవిష్కరణ

చేవెళ్ల: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, రజాకార్లకు ఎదురు నిలిచి పోరాడి అమరుడైన దొడ్డి కొమురయ్యను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. కురుమ సంఘం ఆధ్వర్యంలో మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని సోమవారం ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, అరుణోదయ సంఘం నాయకురాలు విమలక్క తదితరులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం కేజీఆర్ గార్డెన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో మహనీయులుగా ఎదగాలని ఆకాంక్షించారు. విద్యతోనే భవిష్యత్ ఉంటుందని, అన్ని రకాలుగా అభివృద్ధి చెందుతారని అన్నారు. నైపుణ్యం ఉంటే ఉపాధి అవకాశాలు ఉంటాయని చెప్పారు. సామాజిక తెలంగాణ రావాలంటే అందరూ చైతన్యవంతులు కావాలన్నారు. ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, కురుమ సంఘం నాయకుడు క్యామ మల్లేశ్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు కురుమలకు సముచిత స్థానం కల్పించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తరువాత అన్ని కుల వృత్తులకు కేసీఆర్ ప్రత్యేకంగా ఉపాధి అవకాశాలను కల్పించి అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, బీజేపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ ఎం.విజయలక్ష్మి, జెడ్పీటీసీ ఎం.మాలతి, సర్పంచ్ బి.శైలజ, కురుమ సంఘం జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయం

కందుకూరు: నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి చేయడానికి దొడ్డి కొమురయ్య చేసిన పోరాటాన్ని ప్రతి కురుమ ఆదర్శంగా తీసుకోవాలని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య త్యాగం చిరస్మరణీయమని కొనియాడారు. కొమురయ్య అందించిన చైతన్య స్ఫూర్తి మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ కొనసాగిందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేశ్, అరుణోదయ నాయకురాలు విమలక్క, రాష్ట్ర నాయకులు నరేష్, ఐలయ్య, శంకర్, మండల కురుమ సంఘం అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య, మాజీ పీఏసీఎస్ చైర్మన్ సరికొండ మల్లేష్, ఎంపీటీసీలు పద్మ, బి.మల్లేష్, సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై విస్తృత ప్రచారం చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి

షాద్‌నగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లే విధంగా ప్రచారం నిర్వహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. మేరా బూత్ సబ్ సే మజ్‌బూత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని బాసరాజు నివాసంలో బీజేపీ నేతలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా బీజేపీ ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతోందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు బూత్ స్థాయిలో ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను సంఘటితం చేయాలని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు పూర్తిగా విసిగిపోయారని, రాష్ట్రంలో కొనసాగుతున్న రాచరిక పాలనను అంతమొందించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, నాయకులు అందె బాబయ్య, డాక్టర్ విజయ్‌కుమార్, దేపల్లి అశోక్‌గౌడ్, వెంకటేష్ గుప్తా, మిథున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



స్థానిక నేతలతో మాట్లాడుతున్న బొక్కా నర్సింహారెడ్డి

ప్రత్యేక ప్రణాళికతో మున్సిపాలిటీల అభివృద్ధి

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: ప్రత్యేక ప్రణాళికతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి తెలిపారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని మిథులానగర్‌లో రూ.50 లక్షల వ్యయంతో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్డు, రెడ్డిబ్యాటరీ వద్ద రూ.36 లక్షలతో రిటైనింగ్ వాల్, దీన్‌దయాళ్‌నగర్‌లో రూ.23 లక్షలతో సీసీరోడ్డు పనులకు ప్రారంభోత్సవాలు, లక్ష్మీనర్సింహ కాలనీలో రూ.18 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు, మిథులానగర్‌లో రూ.32 లక్షలు, 45వ డివిజన్‌లో రూ.50 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీరోడ్డు పనులకు సోమవారం శంకుస్థాపనలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో కార్పొరేషన్‌లో రూ.75 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. అంతకు ముందు పెద్ద చెరువు వద్ద ఏర్పాటు చేయనున్న క్రీడా మైదానం, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ట్రంక్‌లైన్, చెరువు సుందరీకరణ పనులను మంత్రి అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సీహెచ్ నాగేశ్వర్, డీఈ గోపీనాథ్, కార్పొరేటర్ అక్కి మాధవి, మీర్‌పేట బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి సబితారెడ్డి తదితరులు

నిరుపేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



ధర్నాలో పాల్గొన్న ప్రజా సంఘాల నాయకులు

- కలెక్టరేట్ ఎదుట ప్రజాసంఘాల ధర్నా

ఇబ్రహీంపట్నం రూరల్: ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు అందజేయాలని ప్రజా సంఘాల పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పి. యాదయ్య డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్ పగడాల యాదయ్య, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ధర్మానాయక్ మాట్లాడారు. జిల్లాలో ఇళ్లు లేని పేదలకు స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో 17వేల ఎకరాల భూమి కబ్జాకు గురైందని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయని అన్నారు. పారిశ్రామికవేత్తలకు వేల ఎకరాలు ధారాదత్తం చేస్తూ పేద ప్రజలకు ఇంటి స్థలం ఇవ్వకపోవడం సిగ్గు చేటన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉందని వాటిని వెంటనే పూర్తి చేసి స్థానికులకు ఇవ్వాలని కోరారు. రైతు సంఘం జిల్లా నాయకుడు కాడిగళ్ల భాస్కర్ మాట్లాడుతూ.. అర్హులైన వారికి పెన్షన్లు, కొత్త రేషన్ కార్డులు జారీ చేయాలని, లేదంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, కందుకూరి జగన్, అంజయ్య, సీహెచ్ జంగయ్య, ఆలంపల్లి నర్సింహ, జగదీష్, కిషన్, మల్లేశ్, గణేశ్, రాజశేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఔటర్.. ఇక సూపర్‌గా

- ఐటీ కారిడార్‌లో ఇక ఈజీ జర్నీ
- సర్వీసు రోడ్లు నాలుగులైన్‌లకు విస్తరణ
- మరో రెండు చోట్ల ఇంటర్‌చేంజ్‌లు
- అంతర్జాతీయ ప్రమాణాలతో సిద్ధం చేసిన సైకిల్ ట్రాక్
- ఐటీ సంస్థల విస్తరణకు అనుగుణంగా సదుపాయాల మెరుగు

సాక్షి, సిటీబ్యూరో: ఐటీ కారిడార్ పరిధిలోని ఔటర్ రింగ్ రోడ్డు ఆధునిక హంగులను సంతరించుకుంటోంది. ఔటర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో ఐటీ, కార్పొరేట్ సంస్థలు శరవేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ఇందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఔటర్ మీదుగా ఐటీ కారిడార్‌లలోకి ప్రవేశించేందుకు ఇప్పటికే నార్సింగి వద్ద కొత్తగా ఒక ఇంటర్‌చేంజ్‌ను ఏర్పాటు చేయగా, ఐటీ సంస్థలు, ఉద్యోగుల రాకపోకల కోసం మరో రెండు చోట్ల ఇంటర్‌చేంజ్‌లను అందుబాటులోకి తేనున్నారు. ఈ మేరకు పనులు వేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.29.50 కోట్లతో చేపట్టిన నార్సింగి ఇంటర్‌చేంజ్‌ను ఇటీవల మంత్రి కేటీఆర్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఇది వినియోగంలోకి రావడంతో వాహనాల రాకపోకలు కూడా గణనీయంగా పెరిగినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. ఈ ఇంటర్‌చేంజ్ నుంచి నార్సింగి, మంచిరేవుల, గండిపేట్ ప్రాంతాలతో పాటు లంగర్ హౌస్, శంకర్‌పల్లి ప్రాంతాలకు చెందిన ప్రజల రాకపోకలు ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే కోకాపేట్, మల్లంపేట్‌లో ఇంటర్‌చేంజ్‌లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఔటర్ మీదుగా కోకాపేట్‌కు చేరుకోవడం ఎంతో సులువవుతుంది. ఈ రెండు చోట్ల వినియోగంలోకి వస్తే 158 కిలోమీటర్ల ఔటర్ మార్గంలో మొత్తం 22 ఇంటర్‌చేంజ్‌లు ఉంటాయి.



సర్వీస్‌రోడ్ల విస్తరణ

- మరోవైపు ఐటీకారిడార్‌లకు ఈజీగా రాకపోకలు సాగించేందుకు హెచ్ఎండీఏ పెద్ద ఎత్తున సర్వీస్‌రోడ్ల విస్తరణ చేపట్టింది.
- సుమారు 24 కిలోమీటర్ల మార్గంలో రెండు లైన్లు ఉన్న సర్వీస్ రోడ్లను 4 లైన్లకు విస్తరిస్తున్నారు. త్వరలోనే అదనపు రోడ్లు అందుబాటులోకి రానున్నాయి.
- హెచ్ఎండీఏ అనుబంధ సంస్థ హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీసీఎల్) సర్వీస్ రోడ్ల విస్తరణ చేపట్టింది. నానక్‌రాంగూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు, నార్సింగి నుంచి కొల్లూరు వరకు 24 కిలోమీటర్ల మేర ప్రస్తుతం ఉన్న రెండు లైన్ల రోడ్లను నాలుగు లైన్లకు పెంచుతున్నారు. సుమారు రూ.380 కోట్లతో పనులు కొనసాగుతున్నాయి.

ఆగస్టు 15న సైకిల్ ట్రాక్ ప్రారంభం

అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందించిన సైకిల్ ట్రాక్ ఆగస్టు 15 కానుకగా అందుబాటులోకి రానుంది. సుమారు రూ.100 కోట్ల అంచనాలతో నానక్‌రామ్‌గూడ నుంచి తెలంగాణ పోలీస్ అకాడమీ వరకు 8.5 కిలోమీటర్లు, కొల్లూరు నుంచి నార్సింగి వరకు 14.5 కిలోమీటర్ల మార్గంలో సైకిల్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. ఇది 5.3 మీటర్ల వెడల్పుతో, మూడు లైన్‌లలో ఉంటుంది. 'ఐటీ ఉద్యోగులే కాకుండా అన్ని వర్గాల ప్రజలు ఈ ట్రాక్‌ను వినియోగించుకోవచ్చు. అద్దె సైకిళ్లు లభిస్తాయి. ట్రాక్ పొడవునా రెస్ట్‌రూమ్‌లు, కెఫెటేరియాలు, బ్రేక్‌ఫాస్ట్ సెంటర్‌లు కూడా ఉంటాయి'. అని ఒక అధికారి వివరించారు. అలాగే సైకిళ్లకు పంక్చర్‌లయినా, ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మరమ్మతులు చేస్తారని చెప్పారు. ప్రథమ చికిత్స కేంద్రాలను కూడా అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

దైవదర్శనానికి వెళ్లొచ్చేసరికి..

ఇంట్లో నగలు, నగదు చోరీ



ఇంట్లో చిందర వందరగా పడిన వస్తువులు

కొత్తూరు: ఓ కుటుంబం దైవదర్శనానికి వెళ్లగా ఇంట్లో చొరబడిన దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన కొత్తూరులో సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన జెనిగ శ్రీను, మాధవి భార్యా, భర్తలు. వీరు గతనెల 30న తిరుపతి ఆలయానికి వెళ్లారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం వారి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటాన్ని పక్కింటి వారు గమనించి వారికి సమాచారం ఇచ్చారు. దీంతో బాధితుడు ఎస్సీ కాలనీలో ఉండే తన తమ్ముడు శివకుమార్‌కు విషయం చెప్పి ఇంట్లోకి వెళ్లి పరిశీలించమని చెప్పాడు. బీరువా, ఇతర చోట్ల వెతకగా.. ఇంట్లో దాచిన రూ..20 వేల నగదు, 4 తులాల బంగారు చైన్ కనిపించలేదని అన్నకు తెలిపాడు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకు చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్ విజయాన్ని ఆపలేరు

పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న వీర్లపల్లి శంకర్

కొందుర్గు: బీఆర్‌ఎస్, బీజేపీలు ఎన్ని కుట్రలు పన్నినా కాంగ్రెస్ గెలుపును ఆపలేరని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం సభను అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నాయకులు అన్ని విధాల ప్రయత్నాలు చేశారని, అయినప్పటికీ తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకంతో భారీగా తరలివచ్చారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇటు రాష్ట్రంలో, అటు దేశంలో కాంగ్రెస్‌కు అధికారం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను మరిచిపోయిందని, తొమ్మిదేళ్ల పాలనలో దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, నిరుద్యోగులకు ఉద్యోగాలు, రైతులకు రుణమాఫీ ఇలా చెప్పుకుంటుపోతే బీఆర్ఎస్ మాటల ప్రభుత్వమే కాని చేతల ప్రభుత్వం కాదని విమర్శించారు. అభివృద్ధి పనుల పేరుతో శిలాఫలకాలు వేయడం, తిరిగి చూడకపోవడం దారుణమన్నారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, నాయకులు అంజిరెడ్డి, గోవర్దన్ గౌడ్, నరేందర్, రామస్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని విక్రయించకుండా అడ్డుకోవాలి

అదనపు కలెక్టర్‌కు ఖానాపూర్ గ్రామస్తుల వినతి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తలకొండపల్లి: ప్రభుత్వ భూమిని విక్రయించకుండా అడ్డుకోవాలని ఖానాపూర్ గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయాలని పేర్కొన్నారు. ఖానాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో 16, 18, 20 సర్వే నంబర్లలో ఉన్న 24.20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆ గ్రామానికి చెందిన కొందరు రైతులు కోర్టు ద్వారా పట్టాలు పొందారు. కానీ వారు ఆ భూమిలో సాగులో లేరు. అయితే ఆ భూమిపై పట్టాలు పొందామని, అట్టి భూమిపై అధికారం తమదేనని చెప్పి, ఇటీవల అమ్మకానికి పెడుతున్నారు. ఆ భూమిని ధరణి పోర్టల్‌లో నిషేధిత జాబితాలో చేర్చి అమ్మకాన్ని ఆపాలని లేదా అడ్డుకోవాలని కలెక్టర్‌కు విన్నవించారు.

9న ఉచిత వినికిడి శిబిరం

అబ్దుల్లాపూర్‌మెట్: పెద్దఅంబర్‌పేట మున్సిపాలిటీ లక్ష్మారెడ్డిపాలెంలో గల యూనికార్ప్స్ వర్డ్ అండ్ డీడ్ హాస్పిటల్ మరియు యూనికార్ప్స్ పునరావాస కేంద్రంలో 15 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉండి చెవి మరియు వినికిడి సమస్యలెదుర్కొంటున్న పిల్లల కోసం ఈనెల 9న ఉచిత సహాయ శిబిరాన్ని నిర్వహించనున్నామని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జ్యోత్స్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినికిడి సమస్యలు ఉన్నవారికి సాహి (సొసైటీ టు ఎయిడ్ ద హియరింగ్ ఇంపైర్డ్) సంస్థ సహకారంతో వినికిడి పరికరాలు ఉచితంగా అందజేస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

పహాడీషరీఫ్: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. బిహార్ రాష్ట్రానికి చెందిన హరీంద్రా చౌహాన్(30), కృష్ణ చౌహాన్(28) రావిర్యాలలో నివాసం ఉంటున్నారు. ఆదివారం రాత్రి 8 గంటలకు కూరగాయలు కొనేందుకు ద్విచక్రవాహనంపై రావిర్యాలలోని ఓ దుకాణానికి వెళ్లారు. తిరిగి వెళ్తున్న సమయంలో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపుతప్పి కిందపడింది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడగా.. హరీంద్రకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిద్దరిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం కృష్ణ మృతి చెందాడు.

ఆలయంలో చోరీ

బంగారం, వెండి ఆభరణాలు, నగదు అపహరణ

అబ్దుల్లాపూర్‌మెట్: దేవాలయం తలుపులు, హుండీ పగులగొట్టిన దుండగులు బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించుకుపోయారు. ఈ సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాచారం గ్రామంలోని శ్రీ లక్ష్మీనర్సింహస్వామి దేవాయలంలోకి ఆదివారం అర్ధరాత్రి దొంగలు ప్రవేశించి ఆలయ ప్రధాన ద్వారాన్ని పగుల గొట్టారు. అందులోని రెండు తులాల బంగారం, 300ల గ్రాముల వెండి ఆభరణాలతో పాటు హుండీలోని సుమారు రూ. 3వేల నగదును అపహరించుకుపోయారు. వీటితో పాటు ఆలయంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ మానిటర్‌ను కూడా ఎత్తుకెళ్లారు. పూజారి సురేష్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీంతో ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు.

రూ.100 కోట్లతో తండాల అభివృద్ధి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

- బీటీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన



అన్నాసపల్లి-పుల్లేరుబోడ్‌తండా బీటీరోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కడ్తాల్: తమ ప్రభుత్వం గిరిజనుల సంక్షేమానికి కృషి చేస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాల్ మండల పరిధిలోని కానుగబావితండా, పోచమ్మగడ్డతండా, పుల్లేరుబోడ్‌తండా, నాగిరెడ్డిగూడ తండా, వెలుగురాళ్లతండా, నార్లకుంటతండా, రేకులకుంటతండా, బాలాజీనగర్, బోయిన్‌గుట్ట తండాలకు ఎస్టీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.14.55 కోట్లతో నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్ల నిర్మాణాలకు, సోమవారం ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.100 కోట్ల నిధులతో నియోజకవర్గంలోని గిరిజన తండాల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో 54 తండాలను పాలనా సౌలభ్యం, స్వయం పాలన కోసం తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా తండాల్లో రూ.20 లక్షలతో పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. మౌలిక వసతుల కల్పనలో భాగంగా, సీఎం కేసీఆర్ సహకారంతో అన్ని తండాలకు బీటీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గానికి 5వేల ఇళ్లు మంజూరయ్యాయని, గృహలక్ష్మి పేరిట ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలు అందజేయనున్నట్లు తెలిపారు. గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములకు ప్రభుత్వం పట్టాలు అందిస్తోందని చెప్పారు. గిరిజనుల సంక్షేమం కోసం దోహదపడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి, వెన్నుదన్నుగా ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతుబంధు జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు వీరయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, పారిశ్రామికవేత్త విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, సర్పంచ్‌లు హంశ, శంకర్, సులోచన, పాండు, కమ్లీ బీచ్యానాయక్, భారతమ్మ, ,తులసీరాం, లోకేశ్, ఎంపీటీసీలు గోపాల్, లచ్చిరామ్‌నాయక్ ఉన్నారు.

పంచాయతీల అభివృద్ధికి పెద్దపీట



జాఫర్‌గూడలో డ్వాక్రా భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మంచిరెడ్డికిషన్‌రెడ్డి

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

- జాఫర్‌గూడ, పిగ్లీపూర్‌లలో పంచాయతీ భవనాల ప్రారంభం

అబ్దుల్లాపూర్‌మెట్: పంచాయతీల అభివృద్ధికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. పరిపాలనా సౌలభ్యం కోసమే నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం జాఫర్‌గూడ, పిగ్లీపూర్ గ్రామంలో రూ. 20లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాలను, మరో రూ.18లక్షల వ్యయంతో జాఫర్‌గూడలో నిర్మించిన డ్వాక్రా భవనాన్ని సర్పంచులు కొర్ర లావణ్య, రాధతో పాటు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నూతనంగా ఏర్పాటైన పంచాయతీలను రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రజల సౌకర్యార్థం తమ గ్రామంలో నూతన పంచాయతీ భవన నిర్మాణం చేపట్టాలంటూ పట్టుదలతో కృషి చేసిన ఆయా గ్రామాల సర్పంచులతో పాటు పాలకవర్గ సభ్యులను ఎమ్మెల్యే మంచిరెడ్డి అభినందించారు. గ్రామాభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ విఠల్‌రెడ్డి, జడ్పీటీసీ దాసుగౌడ్, ఎంపీపీ రేఖ, వైస్ ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు అక్బర్ పాషా, మజీద్‌పూర్ సర్పంచ్ పోచంపల్లి సుధార్‌రెడ్డి, ఉపసర్పంచ్ శేఖర్‌యాదవ్, మాజీ సర్పంచులు జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవనాలకు స్థలం కేటాయింపు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: బైండ్ల, బుడగజంగం, మోచి కులాల కమ్యూనిటీ భవనాలకు ప్రభుత్వం స్థలం కేటాయించింది. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 13లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని మూడు కుల సంఘాలకు కేటాయించింది. సదరు భూమిని సాంఘిక సంక్షేమ శాఖకు బదిలీ చేయాల్సిందిగా రెవె న్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

బైక్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

తలకొండపల్లి: బైక్ అదుపు దప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని కోమటికుంట తండాలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటేశుయాదవ్ కథనం ప్రకారం.. తండాకు చెందిన ముదావత్ వాస్య (55) తన బైక్‌పై తలకొండపల్లి మండల కేంద్రానికి వెళుతుండగా మార్గమధ్యలో చీపునుంతల గేటు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడిపోయాడు. తలకు బలమైన దెబ్బలు తగిలి తీవ్రంగా రక్తస్రావం జరిగింది. దీంతో వాస్య అక్కడికక్కడే మృతిచెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

వ్యక్తి ఆత్మహత్య



సప్పిడి వెంకటేష్ మృతదేహం

పహాడీషరీఫ్: తాగుడుకు బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. తుక్కుగూడ గ్రామానికి చెందిన సప్పిడి వెంకటేష్ (48) వ్యవసాయదారుడు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పులపాలయ్యాడు. ఈ క్రమంలోనే తాగుడుకు బానిసయ్యాడు. గతంలో వెంకటేష్ రెండుసార్లు ఆత్మహత్యాయత్నం కూడా చేశాడు. ఆదివారం రాత్రి మద్యం సేవించి రావడంతో భార్య మందలించింది. కుటుంబసభ్యులు నిద్రపోయాక ఆత్మహత్య చేసుకున్నాడు.

విద్యుదాఘాతంతో పాడి ఆవు మృతి



విద్యుత్ షాక్‌తో చనిపోయిన పాడి ఆవు

మహేశ్వరం: విద్యుదాఘాతంతో పాడి ఆవు చనిపోయిన ఘటన మండలలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. సిరిగిరిపురం గ్రామానికి చెందిన పర్వతాలు వ్యవసాయంతో పాటు, పాడి ఆవులను పెంచుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం తన ఆవును మేతకు వదిలాడు. ఈ క్రమంలో విద్యుత్ తీగలకు తాకి చనిపోయింది. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని పలుమార్లు ఆ శాఖ అధికారులకు చెప్పినా వారు పట్టించుకోలేదని రైతు తెలిపాడు. విద్యుత్ షాక్‌కు గురై రూ. 70వేల విలువ చేసే ఆవు చనిపోయిందని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని పర్వతాలు కోరారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని సందర్శించిన ఏపీ మంత్రి

ఖైరతాబాద్: సాగర తీరంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏపీ మంత్రి నాగార్జున, ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, ప్రొఫెసర్ గంటా చక్రపాణి ఇతర దళిత నాయకులు సోమవారం సందర్శించారు. సీఎం కేసీఆర్ ఎంతో ఉన్నతమైన ఆలోచనతో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని మంత్రి నాగార్జున అన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పాలన సాగుతోందని, ఇక్కడ అంబేడ్కర్ విగ్రహం ఎలా ఉంది, ఎలా అభివృద్ధి చేశారు అనే విషయాలను అధ్యయనం చేశామని తెలిపారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహ ఆవరణలోని మ్యూజియం, థియేటర్‌లను మంత్రి పరిశీలించారు.

వరి విత్తనాల్లో తాలు



వరి విత్తనాల్లో నాసిరకమైన విత్తనాలు ఉన్నాయని చూపిస్తున్న రైతు మల్లారెడ్డి



మల్లారెడ్డి కొనుగోలు చేసిన వరి విత్తనాల బ్యాగు

వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేసిన రైతు

యాచారం: నాసిరకమైన వరి విత్తనాలను చూసి రైతు విస్తుపోయాడు. వేలాది రూపాయలు ఖర్చు చేసి విత్తనాలు కొనుగోలు చేస్తే ఆ విత్తనాలు నాసిరకమైనవి అని గుర్తించిన ఆ రైతు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. మండల పరిధిలోని మొండిగౌరెల్లికి చెందిన కొలాన్ మల్లారెడ్డి సోమవారం యాచారం మండల కేంద్రంలో ఉన్న ఓ విత్తనాల దుకాణంలో ఎంపీ3030ప్లస్, హైబ్రీడ్ రైస్ సీడ్స్‌కు చెందిన 3 కిలోలుండే 6 బ్యాగులను (ఒక్కటి రూ.950) రూ.5,700 ఖర్చు చేసి కొనుగోలు చేశాడు. ఇంటికి తీసుకెళ్లి నీళ్లల్లో పోసి చూసే సరికి సగం విత్తనాలు తేలాయి. గంట పాటు అలానే నీళ్లల్లో ఉంచిన వరి విత్తనాలు తేలడంతో వెంటనే విత్తనాలు కొనుగోలు చేసిన వ్యాపారికి ఫోన్ చేశాడు. యాచారం మండల వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌కు కూడా ఫిర్యాదు చేశాడు. నాణ్యమైన విత్తనాలు, అధిక దిగుబడి వస్తుందనే ఆశతో మంచి పేరున్న కంపెనీ విత్తనాలు కొనుగోలు చేస్తే నాసిరకమని తెలిసి విస్తుపోయినట్లు ఆ రైతు పేర్కొన్నాడు. హైబ్రీడ్ పేరుతో నాసిరకమైన విత్తనాలు సరఫరా చేసే యాజమాన్యాలపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కొలాన్ మల్లారెడ్డి అధికారులను కోరారు. ఇదే విషయమై వ్యవసాయాధికారి సందీప్‌కుమార్‌ను సంప్రదించగా మంగళవారం దుకాణానికి వెళ్లి విత్తనాలను పరిశీలిస్తానని తెలిపారు.

సభ సక్సెస్.. కురుమల్లో జోష్



డోలు వాయిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: కురుమ సంఘం ఆధ్వర్యంలో చేవెళ్లలో చేపట్టిన దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ, సభ కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. పట్టణంలో కళాకారులతో చేపట్టిన ర్యాలీలో నిర్వహించిన ఆటపాటలు ఆకట్టుకున్నాయి. మహిళల బోనమెత్తగా పోతరాజుల నృత్యాలు, డిల్లెం బల్లెం చప్పుల్లతో పట్టణమంతా మార్మోగింది. సభకు హాజరైన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యలు డోలు వాయించి అలరించారు. పెద్ద ఎత్తున ప్రజలు హాజరవ్వడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. దీంతో దారి మళ్లించి సమస్యను పరిష్కరించారు.

మండల కేంద్రంగా ప్రకటించాలి



నిరాహార దీక్షలో జేఏసీ నాయకులు

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ప్రకటించాలని ఆ గ్రామ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు జేఏసీ నాయకులు ఎసోమవారం రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ఎన్ని ధర్నాలు, దీక్షలు చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధుల్లో చలనం లేదన్నారు. మండలాన్ని ఖచ్చితంగా సాధించి తీరుతామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.